BHARATH SAMACHAR DIGITAL

26, నవంబర్ 2026, గురువారం భారత్ సమాచార్

పాఠశాల స్థాయి నుంచే రాజ్యాంగ పాఠాలు బోధించాలి



భారత్ సమాచార్, మెదక్ జిల్లా: విద్యార్థుల్లో భారత రాజ్యాంగంపై పూర్తి అవగాహన కల్పించేందుకు ఐదో తరగతి నుంచే రాజ్యాంగాన్ని ప్రత్యేక సబ్జెక్టుగా ప్రవేశపెట్టాలని హోలియదాసరి హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శాఖమూరి యాదగిరి హోలియదాసరి తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదో తరగతి వరకు మాత్రమే కాకుండా ఉన్నత విద్యలోనూ రాజ్యాంగాన్ని ప్రత్యేక పాఠ్యాంశంగా చేర్చాలని కోరారు.

భారత రాజ్యాంగం దేశ ప్రజలకు కల్పించిన హక్కులు, బాధ్యతలు, సమానత్వం, న్యాయం వంటి కీలక అంశాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని యాదగిరి అభిప్రాయపడ్డారు. చిన్నతనం నుంచే విద్యార్థులకు రాజ్యాంగ విలువలను పరిచయం చేస్తే భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగమైన భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేతృత్వంలో రాజ్యాంగ పరిషత్ రూపొందించిందని ఆయన గుర్తుచేశారు. 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదించగా, 1950 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చిందని వివరించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం వంటి విలువలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు.

విద్యార్థులకు రాజ్యాంగంపై నిరంతరం బోధన అందించేందుకు ప్రతిరోజూ 45 నిమిషాల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని యాదగిరి కోరారు. ప్రతి పరీక్షలోనూ భారత రాజ్యాంగానికి సంబంధించిన ప్రశ్నలు ఉండేలా పాఠ్యప్రణాళిక రూపొందించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులందరికీ రాజ్యాంగ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

అలాగే సినిమా ప్రదర్శన ప్రారంభానికి ముందు భారత రాజ్యాంగ పీఠికను ప్రదర్శించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఉదయం ప్రార్థనా సమయంలో రాజ్యాంగ పీఠికను చదివించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇలా చేయడం ద్వారా విద్యార్థుల్లో రాజ్యాంగ స్ఫూర్తి, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు.

ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు, ఆపై ఉన్నత విద్యలోనూ రాజ్యాంగాన్ని ప్రత్యేక సబ్జెక్టుగా ప్రవేశపెట్టడం, రోజూ 45 నిమిషాల బోధనకు సమయం కేటాయించడం, ఉచితంగా రాజ్యాంగ పుస్తకాలు అందించడం, పాఠశాలలు, కళాశాలల్లో పీఠిక పఠనం నిర్వహించడం వంటి అంశాలను ప్రభుత్వం పరిశీలించాలని యాదగిరి కోరారు. ఈ

డిమాండ్లపై తెలంగాణ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి విద్యార్థుల్లో రాజ్యాంగంపై అవగాహన పెంపొందించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా నర్సాపూర్ పోరాట సమితి తరపున విజ్ఞప్తి చేశారు.

© 2026 Bharath Samachar